ప్రజాశక్తి

శుక్రవారం 22 మార్చి 2024 5

అనంతపురం



జగన్మోహన్‌రెడ్డి చిత్రంతో చేతిగడియారాలు

◆ బాగేపల్లిలో పట్టుకున్న పోలీసులు

◆ అనంత ముఖ్యనేత గన్‌మెన్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి




వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న చేతిగడియారం

ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లకు తాయిలాలు వేసేందుకు నేతలు సిద్ధం అయ్యారు. అందులో భాగంగా వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రంతో ఉన్న చేతిగడియారాలను ఓకారులో తరలిస్తూ కర్నాటక పోలీసులకు పట్టుబడ్డారు. బెంగుళూరుకు వలస వెళ్లిన ఓటర్లకు వీటిని అందించేందుకు అనంతపురం జిల్లాకు చెందిన ఓ ముఖ్య వైసిపి నాయకుడు వీటిని తరలిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. అనంతపురం నుంచి బెంగళూరుకు సిఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రం ఉన్న 96 చేతి గడియారాలను తరలిస్తున్న ఫార్చునర్ కారు చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీల్లో గురువారం పట్టుబడింది. అనంతపురం జిల్లాకు చెందిన వైసిపి ముఖ్యనాయకుడు అనంతపురం నుంచి బెంగళూరుకు కారులో వాచ్‌లను తరలిస్తున్నట్లు సమాచారం. కారులో ఉన్న గన్‌మెన్ బండి నాగేంద్రపై బాగేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఎపి31హెచ్ఇ1111 నెంబర్ గల ఫార్చ్యూనర్ కారును స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో అనంతపురం నుంచి వలస వెళ్లిన ఓటర్ల కోసం చేతి గడియారాలను తీసుకు వెళ్తున్నట్లు సమాచారం.

ఎంపీ అభ్యర్థులపై అయోమయం

తెలుగేదశం పార్టీలో ఇప్పటికీ పార్లమెంటు స్థానాలపై స్పష్టత రాలేదు. వైసిపి ఇప్పటికే రెండు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. తెలుగుదేశం పార్టీలో మాత్రం ఇప్పటికీ అభ్యర్థులు ఎవరన్న దానిపై స్పష్టత రాలేదు. ఆన్‌లైన్‌లో నిర్వహించే సర్వేలో మాత్రం అనేక పేర్లు ప్రతి రోజూ వినపడుతూనే ఉన్నాయి. ఇందులో పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిర్ణయించనున్నది తేలక ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం కన్పిస్తోంది.



◆ టిడిపిలో తొలగని సస్పెన్స్

◆ తేలని అనంత పార్లమెంటు అభ్యర్థి

◆ హిందూపురం పొత్తులపై మల్లగుల్లాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచే టిడిపి, వైసిపిలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేపట్టారు. ఇందులో భాగంగా విడతల వారీగా అభ్యర్థులను ప్రకటించారు. వైసిపి 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు పూర్తి స్థాయిలో అభ్యర్థులను ప్రకటించేసింది. ఇందులో అనంతపురం ఎంపీ స్థానానికి కురబ సామాజిక తరగతి నుంచి మాజీ మంత్రి శంకర నారాయణ, హిందూపురానికి బోయ సామాజిక తరగతి నుంచి శాంతమ్మను అభ్యర్థులుగా నిలిపింది. టిడిపి మాత్రం ఇంకా అభ్యర్థులను తేల్చే పనిలోనే ఉంది. 2019 ఎన్నికల్లో అనంతపురం పార్లమెంట్‌కు జెసి.పవన్‌కుమార్‌రెడ్డిని బరిలో నిలిపింది. హిందూపురానికి నిమ్మల కిష్టప్పను బరిలో నిలిపింది. ఈ రెండు స్థానాల్లోనూ టిడిపి ఓటమి చెందింది. ఈసారి ఎన్నికల్లో ఈ ఇద్దరి పేర్లు ఎక్కడా వినిపించడం లేదు. రెండు స్థానాలనూ బిసిలకే కేటాయించే అవకాశాలున్నాయని ప్రచారం నడుస్తోంది. అనంతపురం పార్లమెంట్‌కు సంబంధించి ఆన్‌లైన్ సర్వేలో బికె.పార్థసారథి, అంబికా లక్ష్మినారాయణ, ప్రొఫెసర్ రాజేష్ తదితర పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో ఎవరిని అభ్యర్థిగా టిడిపి ప్రకటిస్తుందోనన్న సందిగ్ధత కొనసాగుతోంది. ఇక హిందూపురం ఎంపీ స్థానానికి సంబంధించి పొత్తుల పంచాయితీ తెగనట్లు కన్పిస్తోంది. పొత్తుల అంశంలో టిడిపి, బిజెపి రెండూ మల్లగుల్లాలు పడుతున్నాయి. మొదట హిందూపురం పార్లమెంట్ స్థానం బిజెపికి కేటాయిస్తున్నట్లు ప్రచారం నడిచింది. ఈ మేరకు బిజెపి నాయకులు ఇద్దరు, ముగ్గురు తామే అభ్యర్థులమని ప్రకటించుకున్నారు. తరువాత టిడిపినే ఆ స్థానం నుంచి పోటీ చేస్తుందని ప్రకటించారు. బిజెపి మాత్రం తాము హిందూపురం బరిలో ఉంటామని చెబుతున్నారు. ఈ పొత్తుల వ్యవహారం మూలంగానే ఇప్పటికీ హిందూపురంలో అభ్యర్థులను ప్రకటిచడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ పొత్తులేకపోతే ఎవరు ఇక్కడి నుంచి టిడిపి అభ్యర్థి అన్న దానిపై కూడా చర్చ నడుస్తోంది. మాజీ ఎంపి నిమ్మలకిష్టప్పకు అయితే ఈసారి అవకాశం లేదన్నది స్పష్టమైంది. ఆయన కాకుంటే ఎవరిని టిడిపి ఇక్కడి నుంచి బరిలో నిలుపుతుందన్నది తెలియడం లేదు. వైసిపి ఏమో ఇక్కడ బిసి బోయ సామాజిక తరగతికి చెందిన శాంతమ్మను బళ్లారి నుంచి తెచ్చి పోటీలో పెట్టారు. ఇక్కడ ఆమెకు పోటీనిచ్చేది ఎవరన్నది చూడాల్సి ఉంది. మొత్తంగా టిడిపి పార్లమెంటు అభ్యర్థుల విషయంలో సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. రోజుకొక పేరు ఆన్‌లైన్‌లో సర్వే పేరుతో వినిపిస్తూనే ఉన్నాయి. ఇవి వచ్చినప్పుడల్లా ఆ నాయకుల అనుయాయులు మాత్రం ఆనందపడి పోతున్నారు. తమ నాయకుడికి ఖరారైనట్టేనని సంబరపడుతున్నారు. రెండు, మూడు రోజుల్లోనే మరో పేరుతో సర్వేలో విన్పిస్తోంది. ఇందులో ఏది సత్యం, ఎప్పటికి అభ్యర్థులు ఖరారు అవుతుందోనని ఆశావహులు మాత్రం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.



స్మార్ట్ మీటర్లను తొలగిస్తున్న రైతులు

స్మార్ట్‌మీటర్లపై రైతుల ఆగ్రహం

◆ అడ్డుకున్న అన్నదాతలు ◆ ఏర్పాటు చేసిన మీటర్ల తొలగింపు

ప్రజాశక్తి-పామిడి

మండలంలో వ్యవసాయ బోరుబావులకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయడంపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన దాదాపు 35 స్మార్ట్ మీటర్లను రైతులు తొలగించేశారు. రైతులపై భారం వేసేలా దొడ్డిదారిన తెస్తున్న స్మార్ట్‌మీటర్లు వద్దేవద్దంటూ అధికారులకు తెగేసి చెప్పారు. గురువారం ఉదయం పామిడి మండలం ఎదురూరు, అక్కజాంపల్లి గ్రామాల్లో బోరుబావులకు విద్యుత్ అధికారులు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు దీనిని అడ్డుకుని అధికారులు ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్లను తొలగించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి ముత్యాలు, మల్లేష్ మాట్లాడుతూ ఆదానీ సంస్థకు రూ.68 వేల కోట్ల కాంట్రాక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ల కోసం రైతులపై భారాలు మోపడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అయితే ముందస్తుగా డబ్బు చెల్లిస్తేనే కరెంటు వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. దీనిని అడ్డుకోవాల్సిన ప్రభుత్వం డబ్బును తామే చెల్లిస్తామని చెప్పి రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వ్యవసాయ బోరుబావులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే చర్యలను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కాదని ఏర్పాటు చేస్తే రైతులతో కలిసి వాటిని తొలగించేస్తామని స్పష్టం చేశారు.

'ఉపాధి' అక్రమాలపై చర్యలు తీసుకోండి

డ్వామా పీడీకి వ్యకాసం వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టంలో పనులు చేయకుండానే చేసినట్లు, మొక్కలు నాటుకుండనే నాటినట్లు చూపి అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యకాసం నాయకులు డిమాండ్ చేశారు. బుక్కరాయసముద్రం గ్రామాలో ఉపాధిలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరుతూ గురువారం ఉదయం డ్వామా పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ బుక్కరాయసముద్రం మండలంలోని పసులూరులో రూ.3,04,961,.చెదుల్లలో రూ.1,97,332, జంతులూరు గ్రామంలో రూ.16,093 ఉపాధి బిల్లులను అధికార వైసిపి నాయకులు అక్రమంగా కాజేశారన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలతో తాము అధికారులకు వివరాలను అందించామన్నారు. ఇందులో అక్రమాలకు పాల్పడిన వారిలో అధికార పార్టీ జెసిఎస్ కన్వీనర్, ఎంపిటిసి భర్త, సర్పంచి ఉన్నారన్నారు. వీరంతా అధికార పార్టీ నాయకులే అన్నారు. ఉపాధిలో యంత్రాలను ఉపయోగించి, తప్పుడు బిల్లులు చూపించి డబ్బులు కాజేశారన్నారు. అక్రమాలకు పాల్పడిన వారి పేర్లు, కాజేసిన బిల్లుల వివరాలను అందిచామని వీటిపై ఆయా గ్రామాల్లో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. స్వాహా అయిన సొమ్మును వారి వద్ద నుంచి రకవరీ చేయాలని డిమాండ్ చేశారు.

654 ఆయుధాలు డిపాజిట్ : ఎస్పీ


ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు 654 లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేయించామని ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికలు-2024 నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఆయుధాలు(తుపాకులు) పోలీసుశాఖ వద్ద డిపాజిట్ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 654 లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేయించామని, ఇంకా 80 ఆయుధాలు డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఇందులో 77 ఆయుధాలు బ్యాంకుల సెక్యూరిటీ సిబ్బందితో ఉన్నాయన్నారు. మిగితా 3 ఆయుధాలు కలిగిన వారు వేరే రాష్ట్రాల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి సైతం తెలియజేసి త్వరగా డిపాజిట్ చేయాలని సూచించామన్నారు. ఎన్నికల వేళ ఎవరైనా ప్రలోభపెట్టినా, ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులకు భద్రతాపరమైన ఇబ్బందులు, సమస్యలు ఉన్నా తన ఫోన్ నంబర్ 9440796800 లేదా జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం నంబర్ 9392918293కు సమాచారం ఇవ్వాలన్నారు.

మొక్కలను సంరక్షించడం అందరి బాధ్యత

గుత్తి : మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైసిపి ఐటి జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అనంతపురం రోడ్డులో వివిధ దుకాణాల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రజలకు చెట్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలను లేకపోవడం వల్ల వాతావరణ సమతుల్యం లోపించదన్నారు. మొక్కల పెంపకంతోనే వర్షాలు కురుస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు హరినాథ్‌రెడ్డి, కోటేశ్వరరావు, ఉమాకాంత్‌రెడ్డి, మోహన్, సుధాకర్, జానకిరెడ్డి, తేజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల ఎన్నికల ప్రచారంపై టిడిపి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి వెంకటరామిరెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గరువారం స్థానిక ఆర్‌డిఒను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇందుకు సంబంధించిన ఆధారాలు, ఫొటోలను ఆర్‌డిఒకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోని 27, 28వ డివిజన్‌లోని వాలంటీర్లు వైసీపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు వేయమనిప్రచారం చేస్తున్నారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఆర్‌డిఒ స్పందిస్తూ విచరణ చేపట్టి బాధ్యలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు టిడిపి గోపాల్‌గౌడ్, వన్నూరప్ప, ముక్తియార్, బోయపాటి బాలప్ప, శ్రీకాంత్, చెరుకుతోట పవన్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారు నగలు చూపి నగదు దోపిడీ

మోసపోయిన హైదరాబాద్ వాసి

పామిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

దర్యాప్తు చేస్తున్న పోలీసులు



నకిలీ బంగారాన్ని చూపుతున్న బాధితుడు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు/పామిడి

కొందరు వ్యక్తులు నకిలీ బంగారును చూపి నగదును దోచుకుంటూ అమాయకులను మోసం చేస్తున్నారు. ఇందులో భాగంగానే హైదరాబాదుకు చెందిన వ్యక్తి పామిడి మండల పరిధిలో నకిలీ బంగారు తీసుకుని మోసపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌కు చెందిన శివకృష్ణ తన ఇంటి పక్కనే ఉన్న అనిల్ అనే వ్యక్తి తనది బెంగళూరు ప్రాంతం అని చెప్పి పరిచయమయ్యాడు. అలా పరిచయమైన వ్యక్తి తనకు తెలిసిన వ్యక్తి వద్ద బంగారు నగలు ఉన్నాయి, తక్కువ ధరకే విక్రయిస్తున్నాడు, మీకు కావాలంటే చూడాలని శివకృష్ణకు చెప్పాడు. దీంతో అనిల్ చెప్పిన వారితో శివకృష్ణ ఫోన్‌లో మాట్లాడి రెండు కిలోల బంగారును రూ.10లక్షలకు ఇస్తానని ఒప్పందం తీసుకున్నారు. బంగారును గుత్తి ప్రాంతం వద్దకు తీసుకొస్తా.. మీరు నగదు అక్కడికే తీసుకురావాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనేపథ్యంలో గతవారంలో గురువారం కృష్ణమూర్తి డబ్బులు తీసుకుని హైదరాబాద్ నుంచి మండలంలోని కాసేపల్లి టోల్‌గేట్ వద్ద బంగారం మార్చుకున్నాడు. అనంతరం కృష్ణమూర్తి హైదరాబాద్ వెళ్లిపోయాడు. మరుసటి రోజు శుక్రవారం బంగారు తీసుకుని హైదరాబాదు ప్రాంతంలో తనిఖీ చేయించాడు. అది నకిలీ బంగారు అని తేలడంతో శివకృష్ణ అవాక్కయ్యాడు. వెంటనే అనిల్‌కు ఫోన్ చేయగా పని చేయలేదు. మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు బంగారు మార్చుకున్న పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చి పెద్దవడుగూరు పోలీసులను ఆశ్రయించాడు. వారు నగదు ఇచ్చిన ప్రాంతం లోకేషన్ ఆధారంగా పామిడి మండలంలోకి రావడంతో పామిడి పోలీసులను ఆశ్రయించమని సూచించారు. దీంతో బాధితుడు పామిడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇకపోతే గతేడాదిలో కూడా ఇలానే తెలంగాణకు చెందిన వ్యక్తులు నకిలీ బంగారు కోసం దాదాపు రూ.40 లక్షల మేరకు మోసపోయిన విషయం తెలిసిందే. పెద్దవడుగూరులో కూడా ఒక మెకానిక్, బ్యాంకులో పనిచేసే వ్యక్తులు కూడా నకిలీ బంగారును ఆశ్రయించి మోసపోయి దాదాపు 39 లక్షల మేరకు ఇచ్చి మోసపోయారు. వీరిది కర్ణాటక ప్రాంతం బాగేపల్లిలో కేసు నడుస్తున్నట్లు సమాచారం.

ఎవరూ మోసపోవద్దు : ఎస్ఐ ముత్యాలశ్రీనివాసులు

నకిలీ బంగారు ఆభరణాలు చూపి నగదును దోచుకెళ్లే వ్యక్తుల నుంచి ఎవరూ మోసపోవద్దని ఎస్ఐ ముత్యాలశ్రీనివాసులు సూచించారు. ముందుగా అమాయకులను గుర్తించి వారికి నమ్మకం కలిగించేలా చేసి బంగారును తక్కువ ధరలకే ఇస్తున్నారని చెప్పి నమ్మించి నగదును తీసుకెళ్లి నకిలీని అప్పగిస్తారు. వీరి వల్ల అనేకమంది అమాయకులు మోసపోతున్నారని ఎవరూ వీరి ఉచ్చులో పడకుండా ఉండాలని కోరారు. అలాంటి వ్యక్తులు మీకు కనిపించడంతోపాటు ఫోన్ చేసి మాట్లాడినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల గురువారం జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తులపై నిఘా వేశారు. ఇందులో భాగంగా జిల్లాలో మోహరించిన కేంద్ర సాయుధ పోలీసు బలగాలతోపాటు స్థానిక పోలీసులు పలుచోట్ల కవాతులు నిర్వహించారు. దీంతోపాటు జిల్లా, పట్టణాల్లోకి ప్రవేశించే మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేశార. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లను జల్లెడ పట్టారు. రహదారులు, ప్రధాన కూడళ్లలో వెళ్తున్న బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను వదలకుండా క్షణ్ణంగా పరిశీలించారు.

రాయదుర్గం : పట్టణంలో గురువారం సాయంత్రం కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు, సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. శాంతినగర్‌లోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద మొదలైన కవాతు బళ్లారి రోడ్డు, వినాయక కూడలి, మెయిన్ బజార్, లక్ష్మీ బజార్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకూ కొనసాగింది. కవాతులో రాయదుర్గం, రూరల్ సర్కిల్ పరిధిలోని ఇద్దరు సిఐలు, నలుగురు ఎస్‌లులు, పోలీసు సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ బలగాలు సరిహద్దు భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ దళపతి ఆధ్వర్యంలో 100 మంది సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు, ప్రజలు ఒత్తిడికి లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా వారిలో మనోధైర్యం నింపేందుకు పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఆయుధాలు ధరించి కవాతులో పాల్గొన్న సరిహద్దు భద్రతా దళం, పోలీసు సిబ్బంది కవాతును ప్రజలు ఆసక్తిగా గమనించారు.

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు



రాయదుర్గంలో కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని దేవుని ఉప్పలపాడు, తురకపల్లి, పెద్దయక్కలూరు తదితర గ్రామాల్లో డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ రోషన్, ఎస్ఐ శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

ఉరవకొండ : మోపిడి సమీపంలో పనులు చేస్తున్న వ్యవసాయ కూలీలకు రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ గురువారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కూలీలు, ఇతర కార్మికులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఎండలో తిరగరాదన్నారు. అలా తిరిగితే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. నేరుగా ఎక్కువ సమయం ఎండలో పనిచేయడం వల్ల శరీరంలో నీరంతా చెమట రూపంలో వెళ్లిపోయి శరీరం నిర్జలీకరణకు గురై వడదెబ్బ తగులుతుందన్నారు. ఫలితంగా అధిక జ్వరం, తలనొప్పి, మగతగా ఉండడం, అధిక దాహం వేయడం, తూలుతూ నడవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు వడదెబ్బగా భావించి వెంటనే నీడపాటుకు చేర్చి దుస్తులు వదులు చేసి ఒళ్లంతా తడుగుడ్డతో తుడుస్తూ తాగితే నీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఓ.భగవాన్‌దాస్ పాల్గొన్నారు

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దీర్ఘకాలిక వ్యాధులు, అనారోగ్య సమస్యలు, రుగ్మతలతో బాధపడుతున్న ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, లింగమయ్య కోరారు. ఈమేరకు గురువారం డిఇఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ మూడు రోజుల నుంచి కలెక్టర్ ఆఫీస్ రెవెన్యూ భవనంలో దీర్ఘకాలిక రోగాలు, అనారోగ్య సమస్యలకు సంబంధించిన ప్రతాల పరిశీలన జరుగుతోందన్నారు. అక్కడ పరిశీలిస్తున్న అధికారులను తమ పేర్లు లేవని అడిగినప్పుడు వారు మీ డిపార్ట్‌మెంట్ ద్వారా పంపిన పేర్లను మాత్రమే పరిశీలిస్తున్నామని చెబుతున్నారన్నారు. కావున ఇంకోసారి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయుల వివరాలను సేకరించి న్యాయం చేయాలని కోరార. ఈకార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, వివిధ మండలాల నాయకులు చంద్రమోహన్, వెంకటనాయుడు, నాగేంద్ర, సంపత్‌కుమార్, రామాంజనేయులు, శ్రీరాములు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

గ్రామాల్లో 'ఉపాధి' పనులు కల్పించాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను నివారించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించకపోవడం వల్ల అనేమంది రైతు కూలీలు వలస బాట పడుతున్నారన్నారు. అంతేగాకుండా వలసలు వెళ్లిన చోట ప్రమాదకర పనులు చేసి మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని ఇప్పటికే మండల వ్యాప్తంగా సచివాలయాల అధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. అలాగే సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించడంతోపాటు రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలని మండలంలోని రాచేపల్లి సమీపంలో ఉన్న లిడ్ క్యాప్ చెప్పుల తోళ్ల పరిశ్రమను రీఓపెన్ చేసి శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి చూపాలని 2023లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రిస్వామి, ఆంజనేయులు, కుళ్లాయప్ప, వెంకటస్వామి, ఓబిరెడ్డి, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వంసిద్ధం

రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు మార్చి 16 నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఈనేపథ్యంలో కొత్తగా ఓటర్ నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకూ అవకాశం కల్పించిందన్నారు. మార్చి 16వతేదీలోపు వచ్చిన తొలగింపు, సవరణల దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. కాగా ఎన్నికల ప్రవర్తనా నియమాల్ని అమలు చేసేందుకు మూడు మండలాల ఎంపిడిఒలు, రెండు మున్సిపాలిటీల కమిషనర్లను కలిపి ఐదు టీంలను ఏర్పాటు చేశామన్నారు. వీరితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. వీడియో సర్వే లైన్స్ కూడా నియమించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా 108 గుర్తించి 14 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తరపున ప్రచారం, రాజకీయ పార్టీల నాయకులకు మద్దతుగా వార్డు, మండల వాలంటీర్లు ప్రచారాలు చేస్తే తొలగించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా సభలు, ర్యాలీలకు వాహనాల అనుమతులకు 48 గంటలకు ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతుల మంజూరుకు సింగిల్‌విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. 85 ఏళ్ల పైబడిన వారు ఇంటి నుండే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల తహశీల్దార్లు శేషఫణి, భారతి, చంద్రశేఖర్‌నాయక్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకోవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గార్లదిన్నె మండలం ఇల్లూరు సమీపంలో ఉన్న పెన్నానది ప్రాంతం నుంచి ఇసుక తరలింపును అడ్డుకోవడం భావ్యం కాదని తహశీల్దార్ శేషారామ్‌సింగ్, సిఐ రోషన్ సూచించారు. వారంరోజులుగా అనుమతులు పొందిన వ్యక్తులు ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు సాగిస్తుండగా గ్రామస్తులు, టిడిపి నాయకులు అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. దీంతో సమస్యను పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో గురువారం వీరన్నపల్లి, కొండూరు గ్రామాలకు చెందిన గ్రామస్తులు, టిడిపి నాయకులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఇసుకను తరలించేందుకు అనుమతులు ఉన్నా తమ గ్రామంలో వచ్చే రోడ్డు నుంచి తరలించకుండా చూడాలని కోరారు. అంతేగాకుండా ఇసుకను తరలించుకుపోవడం వల్ల సమీపంలో వందల మంది రైతులకు చెందిన భూముల్లో బోర్లు ఒట్టిపోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికితోడు దుమ్మూధూళితో రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఇందుకు సిఐ రోషన్ స్పందిస్తూ అనుమతులు పొందిన వ్యక్తులు ఎటు నుంచైనా ఇసుకను తరలిస్తారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం అందరూ నడుచుకోవాలని సూచించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యక్తులతో చర్చించి రెండురోజుల్లో విషయం చెబుతామని టిడిపి నాయకులు సమాధానం చెప్పి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు, శింగనమల సిఐ శ్రీధర్, గార్లదిన్నె ఎస్ఐ గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు

ప్రజాశక్తి-శింగనమల

ప్రశాంత ఎన్నికలకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ఆర్ఓ వెన్నెల శ్రీను కోరారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సాధారణ ఎన్నికలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి, జూన్ 6న ఎన్నికల కోడ్ ముగుస్తుందన్నారు. కావున ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నివిధాలా సన్నద్ధం అవుతున్నామని వివరించారు. ఈనెల నామినేషన్ స్వీకరణకు పది రోజుల ముందు వరకు ఫామ్-6 దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫామ్ -7 కు సంబంధించి ఏదైనా తొలగింపులు చేయాలంటే సీఈవో కార్యాలయానికి పంపించి అనుమతి తీసుకున్న తర్వాత తొలగింపులు చేస్తామన్నారు. ఫామ్-6 దరఖాస్తు పరిశీలన అనంతరం ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు తాగునీరు, మెడికల్ సౌకర్యం, ర్యాంప్, లైట్స్, ఫ్యాన్స్, తదితర అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో 90 శాతం కన్నా ఎక్కువగా ఓటింగ్ జరిగిన, మైనస్ 10 శాతం కన్నా తక్కువగా పోలింగ్ జరిగిన, లా అండ్ ఆర్డర్ సమస్యలు లాంటి క్రిటికల్ పోలింగ్‌స్టేషన్లను గుర్తించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, డీలర్లు, వాలంటీర్లు, రాజకీయ పార్టీలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శోభన్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ నాయకులు చెన్నప్పయాదవ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

రాయదుర్గం : సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు విధిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బి.కరుణకుమారి సూచించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక ఫిర్యాదులు అందాయన్నారు. వాలంటీర్లు, ఒప్పంద ఉద్యోగులు తెలిసో తెలియక ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే నిబంధనలు ఉల్లంఘించినట్లే అని వారిపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కమిషన్ ప్రతి విషయాన్ని సీరియస్‌గా పరిగణలో తీసుకుంటుందన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడం, ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. ఓ బృందం రాజకీయ పార్టీల కార్యకలాపాలను గమనిస్తుందన్నారు. సభలు, సమావేశాలు, ప్రచారాలు, మైకులకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పురపాలక సంఘం, వివిధ మండలాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

ఇద్దరు కుమారులకు గాయాలు


మృతిచెందిన గోపాల్, గాయపడిన కుమారులు

కళ్యాణదుర్గం : పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద లగేజీతో వస్తున్న బొలెరో వాహనం, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... కంబదూరు మండలం వైసి.పల్లికి చెందిన గోపాల్ (44), తన కుమారులు తరుణ్, తేజాస్మిన్‌తో పట్టణంలోని పార్వతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో తన పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా వస్తుండగా పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం మలుపు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లగేజీ బొలెరో వాహనం ఢీకొంది. దీంతో గోపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారులు తరుణ్, తేజాస్మిన్ తీవ్రంగా గాయపడ్డారు. పిల్లలకు కాళ్లు, చేతులు విరిగాయి. రక్తపు మడుగులో ఉన్న చిన్నారులను వెంటనే స్థానికులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐ హరినాథ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తర్వాత బొలేరో వాహన డ్రైవర్ నరేష్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మరోసారి వైసిపిదే విజయం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వచ్చే ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధించి మరోసారి అధికారం చేపట్టడం తథ్యమనిఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని 27వ డివిజన్ పరిధిలో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మహిళా యువ మోర్చా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, కులూరు విశాలరెడ్డి, పలువురు బిజెపి మహిళా నేతలు వైసిపిలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని రుద్రంపేటలో దివంగత మహానేత వైఎస్ విగ్రహాన్ని తొలగించేయడం దురదృష్టకరమన్నారు. ప్రశాంతతకు మారుపేరైన అనంత నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నార. వెంటనే ఎస్పీ, కలెక్టర్ స్పందించి ఘటనపై విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కాగా వైసిపి, జగన్‌ను చూస్తే ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. ఎందుకంటే అభివృద్ధిని ఆస్వాదం లేకుండా వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల వద్దకే చేరవేస్తున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు, వారికి అనుకూలంగా ఉన్న మీడియా దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు.


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

జగన్‌రెడ్డిని గద్దెదింపాలి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న సిఎం జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదింపి ఇంటికి సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయనితెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని కృష్ణాపురం, కల్లూరు ఇల్లూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ రైతులపై దౌర్జన్యాలు, భూ కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికార విద్యుత్ కోతలతో రైతులు పంటలు ఎండిపోయి రైతులు నష్టాలపాలైతే కనీసం పరామర్శించిన పాపానపోలేదన్నారు. ఈనేపథ్యంలో టిడిపి ఓటు వేసి అభివృద్ధి ప్రభుత్వాన్ని తీసుకురావడంతోపాటు అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దిసభ్య కమిటీ సభ్యులు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి గాండ్ల విశాలాక్షి, టిడిపి నాయకులు గేటు కృష్ణారెడ్డి, బాలకృష్ణ, మండల కన్వీనర్ పాండు, ఇల్లూరు రామాంజనేయులు, సామల మధు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని మూగే తిమ్మంపల్లి, జంగంరెడ్డిపల్లి, రంగాపురం గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు ఎన్నికల ప్రచానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానానాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ప్రతాప్‌చౌదరి, చంద్రబాబు, జాఫర్‌వలి, ఆకుల అనిల్, ఆకుల రవితేజ, ఎర్రనాగప్ప, రాజన్న, రాజేష్, పిట్టు రంగారెడ్డి, తిప్పన్న, జనసేన నాయకులు రామకృష్ణ, నాగేంద్ర, నాగేష్, రామకృష్ణ, భాస్కర్, లక్ష్మీనాయుడు, రాజగోపాల్, శేఖర్, వెంగల్‌రెడ్డి, రాజారెడ్డి, రామ్మూర్తినాయుడు, రాజేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలికి నమస్కరిస్తున్న శ్రావణిశ్రీ

వైఎస్ విగ్రహం కూల్చివేత ఘటనపై విచారణ : సిఐ


కూల్చిన వైఎస్ఆర్ విగ్రహం

అనంతపురం క్రైం : నగర సమీపంలోని చంద్రబాబు కొట్టాలలో ప్రధాన రహదారిపై ఉన్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ధ్వంసం చేసిన ఘటనపై విచారణ చేపట్టామని 4వ పట్టణ సిఐ ఆర్.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ధ్వంసం చేసిన విగ్రహాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా కూల్చివేత సమయంలో ప్రత్యక్షంగా చూసిన వ్యక్తుల కోసం పరిసర ప్రాంతంలో విచారించారు. ఘటనపై నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఘటనకు పాల్పడిన వారిని తేల్చే పనిలో ఉన్నామన్నారు. రాజకీయ పార్టీలు, గ్రూపుల మధ్య విద్వేషాలు, అలజడులు సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ఇటుకలపల్లిలో స్పెషల్ క్యాంపు

అనంతపురం : అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్థానిక ఇటుకులపల్లిలో స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం వీధులను శుభ్రం చేసినట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపార. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి ఖలీల్‌బాషా, నవీన్‌కుమార్, జాతీయ సేవాపథకం కార్యకర్తలు పాల్గన్నారు.



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బెలుగుప్ప : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ హరినాథ్‌రావు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సాధారణ ఎన్నికల నిర్వహణలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల నియమావళి అమలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, ఎస్ఐ శివ, మండల విద్యాధికారి హరికృష్ణ, విస్తరణ అధికారి మాధవరెడ్డి, దామోదరయ్య, ఎఒ పృథ్వీసాగర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ హరినాధరావు

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ చేయాలి



శింగనమల : రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవలు చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ (ఆర్‌డిటి) సంస్థకు చెందిన పారిన్ కాంట్రిబ్యూటరీ రెగ్యులేటరీ యాక్టు (ఎఫ్‌సిఆర్ఎ)ను వెంటనే రెన్యూవల్ చేయాలని టిడిపి నాయకులు మొండిపోగుల ఎర్రిస్వామి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థ ఐదు దశాబ్దాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఉచిత వైద్యం, విద్యతోపాటు అనేక సేవలు చేస్తోందన్నారు. అంతేగాకుండా సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. అలాంటి ఆర్డీటీ సంస్థకు విదేశాల్లో ఉన్న దాతలు అందించే విరాళాల సేకరణకు ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్‌డిసి సంస్థకు చెందిన ఎఫ్‌సిఆర్‌ను వెంటనే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు.

ఆవులెన్న మాజీ సర్పంచి మృతికి నివాళి

బెలుగుప్ప : మండల పరిధిలోని అవులెన్న మాజీ సర్పంచి ఉప్పర నారాయణస్వామి కుమారుడు నరసింహులు అనారోగ్యంతో మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, వైసిపి మండల అధ్యక్షులు చిన్నమచ్చన్న, మాజీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లపై ఇఆర్ఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-రాయదుర్గం

వార్డు వాలంటీర్లు వాట్సప్ గ్రూపుల ద్వారా వైసిపి అభ్యర్థికి అనుకూలంగా చేస్తున్న ఎన్నికల ప్రచారాన్ని అరికట్టాలని టిడిపి పట్టణ శాఖ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు గురువారం నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బి.కరుణకుమారికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారని, వీటి ద్వారా నిత్యం వైసిపి ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ, వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి వాలంటీర్ల ఎన్నికల ప్రచారాన్ని అరికట్టాలని కోరారు.


ఇఆర్ఒ కరుణకుమారికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేత నాగరాజు

పిఆర్‌సి, అరియర్స్ చెల్లించాలి

పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు పిఆర్‌సి, డిఆర్ అరియర్స్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.పెద్దన్నగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఎన్‌జిఒ కార్యాలయంలో పెన్షనర్ల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వాల్సిన 11వ పిఆర్‌సి, అరియర్స్, 2018 నుంచి రావాల్సిన డిఆర్ అరియర్స్‌ను ఇంత వరకూ చెల్లించలేదన్నారు. పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే పిఆర్‌సి, అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన పెద్దన్నగౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, ట్రెజరర్ జి.రామకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండి ఖలందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ప్రభాకర్, తిప్పన్న, రమేష్‌కుమార్, సి.నారాయణ, బి.పుల్లప్ప, వేణుగోపాల్, బి.క్రిష్టప్ప, మధుసూదన్, అనంతయ్య, సావిత్రి, దేవి, ఆదిలక్ష్మి, నాగరాజేశ్వరి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెద్దన్న గౌడ్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు

టిడిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-డి.హీరేహాల్

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ హనుమంతరెడ్డి పేర్కొన్నారు. హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మలుపునుగుడి గ్రామపంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుతమ్ముళ్లు గడప గడపకూ వెళ్లి టిడిపి ప్రకటించిన సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. టిడిపి అధికా రంలోకి వస్తే విద్యార్థులకు ఏటా రూ. 15వేలు, నిరుద్యోగ భృతి నెలకు రూ. 3వేలు, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేల పెట్టుబడి ఆర్థికసాయం, ప్రతి మహిళకు ఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంగాధర్, మొండి మల్లికార్జున, నాయకులు మోహన్‌రెడ్డి, తిప్పేస్వామి, ఎం.వెంకటేశులు, సోమలాపురం శంకర్, గచ్చి మోహన్, దేవా, తాయప్ప పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

పుట్లూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధులు, విధివిధానాలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను ఎన్నికలను ఎలా నిర్వహించాలి, విధి విధానాలను ఎంసీసీ కోడ్ అమలు, ఓటర్ల జాబితా అప్ డేషన్, హోమ్ ఓటింగ్, పోలింగ్ కేంద్రాలు మౌలిక సదుపాయాలు పలు అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపిడిఒ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన సదస్సు

మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో ఓటుహక్కుపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శీను ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఆర్ఐ కిష్టప్ప, ఎన్నికల అధికారులు వెంకటరామిరెడ్డి, బిఎల్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 31 అన్నారు. మండలంలోని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ హుండీ లెక్కింపు

పామిడి : స్థానిక భోగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ ద్వారా భక్తులు సమర్పించిన ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకులు బాబు పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కింగా రూ.96,666 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మురళీధర్ గుప్తా, అర్చకులు, రాముస్వామి, చంద్రస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో ఇటీవల మరణించిన బోయ కేశవ, దళిత ఓబన్న కుటుంబాలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, టిడిపి నాయకుడు గుమ్మనూరు నారాయణ గురువారం పరామర్శించారు. బోయ కేశవ నూతన ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసి వాటిని తీర్చలేక మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో టిడిపి నాయకుడు గుమ్మనూరు నారాయణ కేశవ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే అనారోగ్యంతో మరణించిన దళిత ఓబన్న కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జక్కలచెరువు గోవిందు, ప్రతాప్, ఓబులేష్, చంద్రబాబు, శివ, శీనప్ప, కాయల రామకృష్ణ, రఘురామయ్య, చిన్న రంగన్న, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

వైసిపి నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

పెద్దవడుగూరు : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని చిత్రచేడుకు చెందిన వైసిపి నాయకులు రఘునాథరెడ్డిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం గ్రామంలో పరిస్థితులపై ప్రజలతో చర్చించారు. అలాగే మొలకతాళ్ల గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన వైసిపి నేత పుల్లారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ చిదంబరరెడ్డి, మండల కన్వీనర్ శరభారెడ్డి, జడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, వెంకస్వామిగౌడు, శేషానందరెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, చిత్రచేడు రంగారెడ్డి, నాగరాజు, బాషా, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ వ్యవస్థాపకులు వెంకటస్వామికి నివాళి

రాయదుర్గం : స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు అప్పారి వెంకటస్వామి వర్ధంతి సభ నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రవికుమార్, హనుమంతరెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటరామిరెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌కుమార్, మురళీకష్ణ, ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, బి.మాధవమూర్తి, సభ్యులు నాగేంద్ర, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన జగన్ : టిడిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతు ప్రభుత్వ మని చెప్పుకునే వైసిపి నాయకులు అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచారని టిడిపి మండల ఇన్‌ఛార్జి బాలాజీ విమర్శించారు. గురువారం మండల పరిధిలోని పి.కొత్తపల్లి, దొడ్డే కొట్టాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రైతులను నాశనం చేశారన్నారు. ముఖ్యంగా విద్యుత్ నిరంతర 9గంటల సరఫరా అని చెప్పి ఇచ్చిన పాపానపోలేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. నాయకులు నష్టపోయిన రైతుల వద్దకు వెళ్లకుండా సినిమా సెట్టింగ్‌లు వేసి రైతులను పిలిపించుకుని మాట్లాడే ముఖ్యమంత్రిని జగన్‌నే చూస్తున్నామన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందాన్ని తీసుకొచ్చిన వైసిపి ప్రభుత్వాన్ని తిరిగి ఆదరించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని మండల కేంద్రంలోని వీరభద్రకాలనీ, గిరిప్రసాద్, భాగ్యనగర్‌లలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆర్టీసీ జోనల్ పర్సన్ మాల్యవంతం మంజుల, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఐదేళ్ల జగనన్న పాలనపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కావున రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భాస్కర్, సర్పంచి పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, భయపరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు